# అందరి నిర్బాధ్యతా ఫలితం చినగంజాం

ఏ తప్పూ చేయని అమాయకుల ప్రాణాలు పోవడం ఎప్పుడయినా బాధ కలిగిస్తుంది. కానీ ఆ బాధలో కూడా హెచ్చుతగ్గులుంటాయి. ఒక్కొక్క పరిస్థితిలో ఆ చావును నివారించడం కష్టసాధ్యమనో, లేక వారి బాధ్యత కూడా కొంత ఉందనో అనుకోగలుగుతాము. అప్పుడు మరీ అంత బాధ అనిపించదు. అటువంటి ఉపశమనమేదీ లేని ఘటన ఫిబ్రవరి 11న చినగంజాంలో ఇద్దరి ప్రాణాలు తీసిన పోలీసు కాల్పులు. కాల్పులలో చనిపోయిన పుల్లారెడ్డి, రాఘవరెడ్లు తమ చావుకు ఎంత మాత్రం బాధ్యులు కారు.

అరెస్టు చేసిన ముద్దాయిలను దౌర్జన్యంగా విడిపించుకోవడానికి గుమిగూడిన గుంపుపైన కాల్పులు జరిపామని ఇంకొల్లు సి.ఐ. పృథ్వీ నారాయణ అన్నారు కానీ అటువంటి గుంపు ఒకటి గుమిగూడిందో లేదో గానీ, పుల్లారెడ్డి, రాఘవరెడ్డి మాత్రం అందులో భాగం కాదు. చినగంజాం మండల కేంద్రంలోని మార్కెట్‌కు వందల మంది రైతులు ప్రతి రోజూ వచ్చినట్లే వచ్చారు ఆ ఇద్దరూ ఆ రోజు సాయంత్రం.

అయినా అరెస్ట్ చేసిన ముద్దాయిలను విడిపించుకోవడం కోసం రైతులు గుమిగూడడానికి ఆ ముద్దాయిలు ఆ ఊరిలో లేరు. వాళ్ళపైన కేసులున్నది చినగంజాం పోలీస్ స్టేషన్‌లోనే అయినా, వారిని అరెస్ట్ చేసింది చినగంజాం పరిసరాలలోనే అయినా, వారిని బంధించినది మాత్రం చినగంజాం పోలీస్ స్టేషన్‌లో కాదు. ఇరవయ్యో ముప్పయ్యో కిలోమీటర్ల దూరాన ఉన్న ఇంకొల్లులో. ఈ చివరి ముక్క మాత్రం

చెప్పకుండా కాల్పుల ఘటనకు సహేతుకంగా కనిపించే ఒక వివరణ ఇచ్చి పత్రికలకెక్కించి ప్రజలను నమ్మింప చేశారు పోలీసులు.

పోనీ ఏ అర్థంలోనైనా ఆనాటి పోలీసు కాల్పులను నివారించడం కష్టసాధ్యమా అంటే కానేకాదు.

ఆనాడు ఇంకొల్లు సి.ఐ. అరెస్ట్ చేసిన రైతులు, వారి అరెస్ట్ గురించి ఆందోళన చెందిన (వాళ్ళను విడిపించడానికి దాడి చేయకున్నా) రైతులు హంతకులు కారు, ముఠాకోర్లు కారు, రాబోయే పంచాయితీ ఎన్నికలలో రిగ్గింగ్ చేయడం కోసం సమాయత్తమైన తెలుగుదేశం కార్యకర్తలు కారు, కాంగ్రెస్ కార్యకర్తలు కారు. మరి వారెవరు? చినగంజాం పరిసరాలలో రాబోతున్న ఉప్పు ఫ్యాక్టరీ వల్ల భూగర్భ జలాలు ఉప్పుమయమై తమ పొలాలు నాశనం అవుతాయని ఆందోళన చెందుతున్న 'రైతన్నలు'.

చినగంజాం దగ్గర 12 గ్రామాల ఇళ్ళకూ, పొలాలకూ అతి దగ్గరగా కేంద్ర ప్రభుత్వం 565 ఎకరాల భూమిని ఉప్పు తయారీకి 'స్నోవైట్ సాల్ట్స్' అన్న ఒక కంపెనీకి లీజుకు ఇచ్చింది. దాని యజమాని ఆనంద్ అని పిలవబడే ప్రవాసాంధ్రుడు. అతను కులానికి 'రెడ్డి' కాకున్నా ఇంటి పేరులో 'రెడ్డి' వుండబట్టి అసలు పేరు ముందు, ఇంటి పేరు వెనుక పెట్టి ఇంగ్లీష్ స్టయిల్‌లో ఎ.పి.రెడ్డి అనే పేరుతో ప్రవాసాంధ్రంలో చలామణి అయ్యాడంటారు. ఇక్కడున్నట్టే అక్కడ కూడా 'పేరు వెనక తోకలకు' విలువ వుంది కదా!

వెనక్కి వచ్చిన తరువాతనో, రాకముందేనో అతను ఈ లీజు పొందాడు. పొలాల పక్కన, మంచినీటి బావుల పక్కన ఉప్పుమళ్ళు తయారు చేసి సముద్రం నుంచి నీళ్ళు తీసుకొచ్చి ఆ నీటిని ఎండబెట్టి ఉప్పు తయారు చేసినట్టయితే చుట్టు పక్కల తాగునీరు, సాగునీరు ఉప్పుమయమవుతాయని ఒకరు చెప్పనక్కరలేదు. ఆ తెలివి కేంద్ర ప్రభుత్వ అధికారులకు వుండవలసింది. వారికి లేకున్నా, గతంలో ఇదే భూమిని ఉప్పు తయారీకి లీజుకి ఇచ్చినప్పుడు గొడవ చేసి రద్దు చేయించిన రైతుల ఆందోళనైనా నేర్పవలసి వుండింది. అదే జరిగి వుంటే 11వ తేదీ నాటి కాల్పులు జరిగి వుండేవి కావు.

కేంద్ర ప్రభుత్వం భూమి లీజుకు ఇచ్చినా, ఉప్పు తయారీకి లైసెన్స్ ఇచ్చినా రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు అనుమతి పొందకుండా ఉత్పత్తి మొదలుపెట్టడం

చట్ట విరుద్ధం. లీజు పొంది సంవత్సరం గడచినా 'స్నోవైట్ సాల్ట్స్' ఆ అనుమతిని ఇప్పటికీ పొందలేదు. పొందకుండా ఉత్పత్తికి ఉపక్రమించడం చట్టవిరుద్ధం కాబట్టి జిల్లా మేజిస్ట్రేటు కూడా అయిన జిల్లా కలెక్టరు ఆ పనిని ఆపి వుండవచ్చును.

కలెక్టర్ ఆ పని చేయకపోగా, చినగంజాం ఎమ్మార్వో తనకు ఉన్న అధికారాన్ని మించిన ఆజ్ఞ జారీ చేసి హైకోర్టులో 'స్టే' తెచ్చుకునే అవకాశం సదరు 'స్నోవైట్ సాల్ట్స్'కు (ఉద్దేశపూర్వకంగా కాదు గానీ) ఇచ్చాడు. ఆ తరువాత ఎమ్మార్వో నుండి కలెక్టర్ దాకా అందరూ 'ఒకసారి చేయి కాలింది చాలు'నంటూ తమకున్న అధికారాన్ని వినియోగించడానికి నిరాకరిస్తున్నారు. రైతులు నేరుగా హైకోర్టుకు పోయారు. రొయ్యల చెరువులపైన సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పుల్లో జనావాసాలకు దగ్గరగానూ, పొలాలకు దగ్గరగానూ నేలపైన ఉప్పు నీటిని నిలవుంచే పరిశ్రమలను అనుమతించ వద్దని చెప్పిన సంగతి, 'స్నోవైట్ సాల్ట్స్' ఇప్పటికింకా కాలుష్య నియంత్రణ బోర్డు అనుమతి పొందని సంగతి హైకోర్టు దృష్టికి తీసుకుపోయారు. హైకోర్టయినా ఆనంద్‌గారి చట్టవిరుద్ధమైన ప్రయోగానికి బ్రేక్ వేసి ఉండవచ్చును. కానీ హైకోర్టు కూడా 'చూద్దాం' అనింది.

ఇంక గత్యంతరం లేక రైతులే దానికి అడ్డంపడ్డారు. అతను రక్షణగా తెచ్చుకున్న పోలీసులు వారిపైన విరుచుకుపడ్డారు. కేసులయ్యాయి. ముద్దాయిలైన ఎనిమిది మందిని అరెస్ట్ చేసే నెపంతో రైతులకు బుద్ధిచెప్పాలని నిర్ణయించుకున్న ఇంకొల్లు సి.ఐ. పృథ్వీనారాయణ అరెస్ట్ చేసిన వారిని ఇంకొల్లులో పెట్టి, పెద్ద పోలీసు బలగంతో చినగంజాం వచ్చి, మార్కెట్ దగ్గరున్న జనంపైన లాఠీలు ప్రయోగించి, బాష్పవాయువు విడిచి, తరిమికొట్టి, కాలుజారి కిందపడి, దానివల్ల గాభరాపడి కాల్పులు జరిపి ఇద్దరిని చంపాడు.

కొన్నేళ్ళ క్రితం ఇదే అధికారి గుంటూరు జిల్లాలోని పాతనాగిరెడ్డిపల్లెలో ఇద్దరు రైతులను ఇంతే అన్యాయంగా కాల్చి చంపాడు. అప్పుడే రాష్ట్ర ప్రభుత్వం అతనిపైన చర్య తీసుకొని వున్నా ఈ కాల్పులను నివారించి ఉండవచ్చు.

**నీహార్ ఆన్‌లైన్ పత్రిక**
**ఫిబ్రవరి 2000**